# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 18 డిసెంబరు, 2025 | పేజీలు : 06


## వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో మూడో విడత లో కాటారం, మల్హర్, మహాముత్తారం, మహదేవపూర్ మండలాలలో జరుగుతున్న గ్రామ పంచాయతీ పోలింగ్ ప్రక్రియను బుధవారం ఐడిఓసి కార్యాల యంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి పరిశీలించారు. గుర్తించిన 35 క్రిటికల్ , సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కార్యాలయంతో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కాటారం మండలంలో 9, మహదేవపూర్ మండలంలో 15, మల్హర్ మండలంలో 11 మొత్తం 35 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. అలాగే 32 మంది సూక్ష్మ పరిశీలకులు పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ కాలుష్య నివారణపై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో బుధవారం పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక , ఓరుగల్లు వైల్డ్ సొసైటీ, జనవిజ్ఞాన వేదిక వరంగల్ ఆధ్వర్యంలో రైతుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. పంట వ్యర్థాలను తగలబెట్టకూడదు , భూసారాన్ని కాపాడుకోవాలి అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది రైతులు పాల్గొన్నారు.ఈ సదస్సులో పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక ప్రతినిధులు కాజీపేట పురుషోత్తం, శ్రవణ్ కుమార్, మరియు ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రతినిధి శ్యామ్ సుందర్ శర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పంట కోతల అనంతరం మిగిలిన వ్యర్థాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. భూమిలో ఉండే మిత్ర పురుగులు, వానపాములు చనిపోయి భూసారం దెబ్బతింటుందని తెలిపారు. ఎస్.ఆర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భార్గవి మాట్లాడుతూ పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నడం మిక్సింగ్ చేయడం ద్వారా, అవి కుళ్లి ఎరువుగా మారి పంట దిగుబడిని పెంచుతాయని శాస్త్రీయంగా వివరించారు.జన విజ్ఞాన వేదిక ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కాలుష్యం వల్ల కలిగే అనర్థాలను రైతులు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు అన్నారావు, షేక్ హుస్సేన్,రాజు తాడగిరి, ఇతర గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు. చివరగా రైతులందరూ పంట వ్యర్థాలను తగలబెట్టబోమని ప్రతిజ్ఞ చేశారు.

### జనగామ జిల్లాల్లో
## 88.48 శాతం పోలింగ్

బుధవారం ప్రశాంతంగా జరిగింది. జనగామ జిల్లాల్లోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో ఎన్నికల పోలింగ్ జరగగా లక్షా 17వేల 381 మందికి ఓటర్లకు గాను లక్షా 3వేల 860 మంది ఓటు వేశారు. దీనితో 88.48 శాతం పోలింగ్ జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడో విడతల్లో జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దీనితో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మూడో విడతలో 91 పంచాయతీలు, 800 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా రెండు పంచాయతీలు, 108 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగతా 89 పంచాయతీల కోసం 267 మంది సర్పంచ్ పదవికి, 1632 మంది వార్డు మెంబర్స్ పదవి కోసం పోటీ పడ్డారు. ఇందు కోసం 960 పోలింగ్ కేంద్రాలు, 1222 ఓపిఓలు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా 9 గంటల వరకు 22.51 శాతం పోలింగ్ జరిగింది. అత్యధికంగా పాలకుర్తిలో జరగగా అత్యల్పంగా కొడకండ్లలో జరిగింది. ఉదయం 11 గంటల వరకు 51.82 శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 1 గంటకు 88.48 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. లక్షా 3వేల 860 మంది ఓటు వేయగా అందులో 51వేల 788 మంది మహిళలు, 52వేల 70 మంది పురుష ఓటర్లు ఉన్నారు.

**పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎన్నికల అధికారులు**

గ్రామ పంచాయతీ ఎన్నికల అబ్జర్వర్ రవికిరణ్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ బుధవారం దేవరుప్పుల, పాలకుర్తి మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ కొడకండ్ల మండలంలో పర్యటించి పరిశీలించారు. పోలింగ్ సరళిని పరిశీలించడంతో పాటు అక్కడి ఏర్పాట్లు, ఓటింగ్ కంపార్ట్మెంట్లు, లైటింగ్, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ తదితరవి పరిశీలించారు. దేవరుప్పుల మండలంలోని సింగరాజుపల్లి పోలంగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన వృద్ధ, దివ్యాంగ ఓటర్లకు అందుతున్న సహకారంపై అడిగి తెలుసుకున్నారు. పోలీస్, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులు అందిస్తున్న సేవల్ని చూశారు. అంతకు ముందు ఉదయమే జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా మూడో విడత ఎన్నికల పోలింగ్ నిర్వాహణ తీరును పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. పాలకుర్తి మండలంలోని తొర్రూర్(జె)గ్రామం, బొమ్మెర పంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పరిశీలించారు. దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపులు, భద్రతా ఏర్పాట్లు, లైటింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు.

**పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమీషనర్**

వరంగల్ పోలీస్ కమీషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం జనగామ జిల్లాలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాల్లో భద్రత ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో అధికారులతో సమీక్షించారు. ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యే వరకు జాగ్రత్తలు తీసుకోవాలని డిసిపి రాజమహేంద్రనాయక్‌ను ఆదేశించారు. పోలీస్ కమీషనర్ సన్‌ప్రీత్‌సింగ్ వెంట వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్రనాయక్‌తో పాటు అదనపు డిసిప రవి, ఏసిపి నర్సయ్య, పలువురు ఎన్స్‌పెక్టర్లు ఉన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు




### పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ పి.ప్రావీణ్య

**ప్రజాపక్షం/సంగారెడ్డి:** మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పి.ప్రావీణ్య వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. నిజాంపేట మండల కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లు క్యూలైన్ నిర్వహణ విదానం ఓటర్లకు అందుతున్న సౌకర్యాలు ముఖ్యంగా వికలాంగుల, వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సదుపాయాలను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం కల్హేర్ మండలం రాపర్తి గ్రామంలోని కౌటింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి కౌంటింగ్‌కు సంబందించిన ఏర్పాట్లు భద్రతా చర్యలు తదితరాలను పరిశీలించి తగిన మార్గదర్శకాలు ఇచ్చారు. ఎన్నికల సాదారణ పరిశీలకులు కార్తీక్ రెడ్డి, నిజాంపేట్ ,బాజపల్లి ,మీర్‌ఖాన్ పేట్ ,రాపర్తి కద్పల్ గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాలలో పరిస్థితులు ఉప సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన వివిధ ఫారాలు రికార్డులు నిర్వహణకు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలో మూడు విడతల లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగాయని ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.

## కారు బోల్తా ... ఒకరు మృతి

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** మండలం నర్సాపూర్ గ్రామ శివారులోని మూలమలుపు వద్ద మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై చల్లా రాజు తెలిపిన వివరాలప్రకారం.. భూపాలపల్లి సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న అల్వాల దేవేందర్ తన సొంత గ్రామమైన నర్సంపేట మండలం గురిజాలకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చి, తిరిగి వెళ్తున్న క్రమంలో నర్సాపూర్ మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడి భార్య అపర్ణ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్‌కు సన్మానం



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** స్థానిక సంస్థల ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన, సందర్భంగా, మండల కేంద్రంలోని, సాయిబాబా కమిటీ అధ్యక్షులు, పుల్కారాం నాగరాజు ఆధ్వర్యంలో, సాయిబాబా దేవాలయంలో, సర్పంచ్, ఎడ్ల లావణ్య రాజు, ఉప సర్పంచ్, గట్ట గల్ల రాజయ్య, వార్డు సభ్యులు, కుంటి భీమయ్య ల కు, సాయిబాబా కాలనీవాసులు, ఘనంగా స్వాగతం పలికి, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్పంచ్ లావణ్య రాజు మాట్లాడుతూ, గ్రామం అభివృద్ధిలో భాగంగా,దేవాలయ అభివృద్ధి కోసం, కృషి చేస్తానని, వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో, మేడ తిరుమల్, ఇటుకల చందు, బోయిని వెంకటేష్, శ్రీకాంత్, ప్యాట మహేందర్, గౌస్, నాగరాజు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## సీతారామాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని రామచంద్రపురం గ్రామంలో శ్రీశివ సీతారామాంజనేయ స్వామి పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా కుడికాల జనమ్మ బాల సిద్దయ్య కోడలు, కుమారుడు మమత రవి దేవస్థానం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఆలయం ముందు ధ్వజస్తంభన ప్రతిష్టాపనకు రూ.2లక్షల 40వేలను విరాళంగా అందజేశారు. ధ్వజస్తంభన ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు, క్రేన్‌తో సహా ధ్వజసంత్తంభన ప్రతిష్టాపన పూర్తి అయ్యేవరకు అన్ని ఖర్చులు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సిద్దయ్య, ఇంద్రారెడ్డి, సత్యనారాయణ, మల్లారెడ్డి, సిద్దేశ్వర్, కనకయ్య, చంద్రమౌళి, నాగరాజు, బాలరాజు, భూపాల్‌రెడ్డి, చంద్రమౌళి, జయరాములు, శ్రీను, విశ్వనాథం, రమేష్, రవీందర్, భవ్య శ్రీ, జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కొట్టే శైలజకు డాక్టరేట్



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (కిట్స్‌డబ్ల్యూ)లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ (ఈసీఐఈ)విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొట్టే శైలజ, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసినది అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి సగర్వంగా తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో, కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ కొట్టే శైలజ తన సాంకేతిక పిహెచ్‌డి థీసిస్‌ను డెవలప్‌మెంట్ ఆఫ్ ఇంటెలిజెంట్ హెల్త్‌కేర్ సిస్టమ్ యుజింగ్ మెషిన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ అప్రోచెస్ ఫర్ ఈఈజీబేస్డ్ ఎమోషన్ డిటెక్షన్ అనే పేరుతో ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ పరీక్షల విభాగానికి సమర్పించారు. . ఈ సందర్భంగా కిట్స్ కళాశాల యాజమాన్యం, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి. నారాయణ రెడ్డి గారు, వొడితల సతీష్ కుమార్, సత్యనారాయణ రాజు,ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి ఎఐ ఆధారిత బయో మీడియల్ సిగ్నల్ ప్రాసెసింగ్ రంగంలో అన్వయించ దగిన, సమాజానికి అవసరమైన వినూత్న పరిశోధనలు చేసినందుకు కొట్టే శైలజని శుభాకాంక్షలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కోమల్ రెడ్డి, డీన్ అకడమిక్ అఫైర్స్, ప్రొఫెసర్ కె వేణుమాధవ్, ప్రొఫెసర్, ఈసిఐఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ కె. శివాని, అందరూ డీన్లు, వివిధ విభాగాల హెడ్స్, అధ్యాపకులు, ప్రభాకరా చారి, కె.ఎల్ ఇ ఎఫ్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ ద్వారా పిహెచ్‌డి నీ పొందడం పట్ల కొట్టే శైలజను అభినందించి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచుకున్నారు.

## మున్నూరు కాపు సంక్షేమానికి అండగా ఉంటా



**ప్రజాపక్షం/హనుమకొండ :** జిల్లా మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణ పనులను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ గత పదేళ్లుగా కేవలం శంకుస్థాపనలకే పరిమితమైన ఈ భవన నిర్మాణాన్ని తమ ప్రభుత్వ హయాంలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదట రూ.5 కోట్లుగా ఉన్న భవన నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.7 కోట్లకు రీ–ఎస్టిమేట్ చేయించి, నిధులు మంజూరు చేయడంతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేశామని పేర్కొన్నారు.ఈ భవనం జిల్లా మున్నూరు కాపు సోదరులకు ఒక కీలక మైలురాయిగా నిలవడమే కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా ఆధునిక సౌకర్యాలతో నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు కుల బాంధవులు మాట్లాడుతూ, జిల్లాల్లో మున్నూరు కాపుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ గతంలో తమ కమ్యూనిటీకి తగిన ప్రాధాన్యం దక్కలేదని తెలిపారు. భవన నిర్మాణాన్ని నాణ్యతతో, పారదర్శకంగా, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు మంద ఐలయ్య, కటకం పెంటయ్య , గైనేని రాజన్ , కోరబోయిన సాంబయ్య, తోట వెంకన్న, దేవర కొండ విజయలక్ష్మి సురేందర్ , వేల్పుల మోహన్ రావు, పెంచాల గోపాల్ , బక్కి రాజ్కుమార్ , మాడిశెట్టి రాజకుమార్, సతీష్ , పుప్పాల రజినికాంత్, కొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## హరిత ఓటింగ్ కేంద్రంలో సెల్ఫీలకు బ్రేక్!




**ప్రజాపక్షం/నెక్కొండ:** ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా హరితహారం ప్రత్యేకతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి మండలంలో రెండు హరిత పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఓటు వేసిన అనంతరం ఓటర్లు ఇష్టమైతే హరిత సెల్ఫీ సెంటర్ వద్ద ఫోటో దిగే అవకాశాన్ని కూడా కల్పించారు.అయితే వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో పరిస్థితి కాస్త భిన్నంగా మారింది. “ఫోటో కోసం” అంటూ మళ్లీ బూత్‌ల వైపు వెళ్లే ప్రయత్నాలు జరగడంతో, నిబంధనలను కఠినంగా అమలు చేసిన పోలీసులు పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లను పూర్తిగా నిషేధించారు. ఫలితంగా హరిత పోలింగ్ కేంద్రం ఉన్నా సెల్ఫీకి మాత్రం చోటు లేకుండా పోయింది.ఈ అంశంపై కలెక్టర్ సత్య శారదా దేవి సందర్శన సందర్భంగా పత్రికా ప్రతినిధులు ప్రశ్నించగా, “పోలింగ్ కేంద్రానికి బయట వేరే చోటే సెల్ఫీ సెంటర్ ఏర్పాటు చేయాల్సింది కదా?” అంటూ కలెక్టర్ చేసిన వ్యాఖ్యలు అక్కడ నవ్వులు పూయించాయి.ఏదేమైనా, పచ్చదనానికి ప్రచారం చేయాల్సిన హరిత పోలింగ్ కేంద్రం నిబంధనల కఠినతతో ‘నో సెల్ఫీ జోన్’గా మారడం వ్యంగ్యంగా మారిందన్న అభిప్రాయం ఓటర్లలో వినిపిస్తోంది.

## 19 నుండి కెయు ఇంటర్ కాలేజ్ యెట్ అథ్లెటిక్ మీట్



**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ యెట్ అథ్లెటిక్ మీట్ 2025 26 ఫర్ మెన్ అండ్ వుమెన్ ఈనెల 19,20 తేదీలలో కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ గ్రౌండ్ లో జరుగుతాయని స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.కుమార స్వామి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ పోటీల్లో మొదటి రోజున అనగా 19న ఉదయం కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాపరెడ్డి, యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. మనోహర్ ఈ క్రీడ పోటీలను ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారు. ఈ పోటీల్లో ఖమ్మం, అదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాలోని కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉన్నటువంటి అన్ని డిగ్రీ, పీ.జి కళాశాలల క్రీడాకారులు దాదాపు 300 మంది క్రీడాకారులు మెన్, వుమెన్ వివిధ క్రీడల్లో పాల్గొంటారని కె.యు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ తెలిపారు. 20వ తారీఖున జరిగే క్రీడల ముగింపు కార్యక్రమం లో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి రామచంద్రం, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మనోహర్ పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేస్తారు ఇట్టి క్రీడ పోటీలలో 100మీ 200మీ, 400మీ, 800మీ, 1500మీ, 5000మీ, 1000 0మీ, 15000మీ, రిలే రేసెస్ 4×400 మీ, 4×100 మీ. జంప్స్ విభాగం లో లాంగ్ జంప్, త్రిబుల్ జంప్, హై జంప్, త్రోస్ విభాగంలో షాట్ పుట్, డిస్క్ త్రో , జావెలిన్ త్రో, హామర్ త్రో, స్త్రీలకు,పురుషులకు నిర్వహించబడునని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్. కుమార్ స్వామి తెలిపారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మూడవ విడత పోలింగ్

**ప్రజాపక్షం/వరంగల్ :** జిల్లాలో మూడవ విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల మూడవ విడత పోలింగ్ నేపథ్యంలో బుధవారం వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం నర్సంపేట మండలం లక్నేపల్లి, ఇటుకాలపల్లి పోలింగ్ కేంద్రాలు, ఖనాపూర్ మండలం ఖనాపూర్, రాగంపేట పోలింగ్ కేంద్రాలు, చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి, తిమ్మరాయనిపహాడ్ పోలింగ్ కేంద్రాలు, నెక్కొండ మండలం రెడ్లవాడ, ఆలంఖానిపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరిత ( గ్రీన్) పోలింగ్ కేంద్రాలతో పాటు పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సిబ్బంది డ్యూటీల అమలు, పోలింగ్ సాగుతున్న విధానం, భద్రతా చర్యలు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. సమర్థవంతమైన పోలింగ్ నిర్వహణకు సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో ఏ విధమైన నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని, ప్రతి ఓటరికి సౌకర్యవంతమైన, అంతరాయం లేని వాతావరణం కల్పించడం సిబ్బందిపై నున్న ప్రధాన బాధ్యత అని అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, పారదర్శకత, నిబంధనల ఖచ్చితమైన అమలు అత్యంత ఔచిత్యం కలదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ఎన్నికల సూచనల మేరకు జిల్లాలోని నాలుగు మండలాల్లో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి మండలానికి రెండు చొప్పున హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొదటి, రెండవ విడతలలో హరిత పోలింగ్ కేంద్రాలలో మిగతా పోలింగ్ కేంద్రాల కంటే సుమారు 3 శాతం పోలింగ్ పెరిగిందని, గ్రీన్ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు వల్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందని, తద్వారా పోలింగ్ శాతం మరింత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మూడవ విడతలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామని,నాలుగు మండలాల్లోని 110 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 282 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలకు గాను 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, ఇతర పోలింగ్ స్టేషన్లలో వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా ఎప్పటికపుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడత లో పోలింగ్ 86 శాతం, రెండో విడతలో పోలింగ్ 88 శాతం నమోదు కావడంతో, పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో మొత్తం 102 గ్రామపంచాయతీలు, 809 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ నిర్వహణ జరుగుతోందని అన్నారు. 7 గ్రామపంచాయతీలు, 137 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని వెల్లడించారు. పోలింగ్ నిర్వహణకు సుమారు 4వేల మంది సిబ్బందిని నియమించామని, ఇందులో 1500 మంది పోలీస్ సిబ్బంది, 2400 మంది పోలింగ్ అధికారులు, మైక్రో అబ్సర్వర్ల ,ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం 2 నుండి కౌటింగ్ ప్రారంభమవుతుందని, ముందుగా వార్డుల కౌంటింగ్, తర్వాత గ్రామపంచాయతీలో సర్పంచ్ కౌంటింగ్ జరుగుతుందని వారన్నారు. ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఆర్డీఓలు ఉమారాణి, సుమా, నోడల్ అధికారులు, ఎంపిడీవోలు, తహశీల్దార్లు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలను కూలీకి దూరం చేసే కుట్ర చేస్తున్న కేంద్రం

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం 2005 రద్దు చేసి మోడీ ప్రభుత్వం 2025 పేరుతో 197 బిల్లును తీసుకురావడంతో ఉపాధి హామీ చట్టం కాస్త పథకంగా మారే ప్రమాదం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు.బుదవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి ఉపాధి హామీ పనులకు అరకొర నిధులు కేటాయిస్తు నీరుగారుస్తుందని, 2005లో ఏర్పడిన బిల్లు చట్టం అయితే ఉపాధిహామీ చట్టం ద్వారా ఈ కొత్త బిల్లు ఉన్న ఉపాధిని లేకుండా చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటి వరకు కేంద్రం 90శాతం నిధులు రాష్ట్రాల వాటా 10శాతం ఉందని ఈ పథకం ద్వారా 40శాతం కేంద్రం 60శాతం చెల్లించే విధంగా రూపొందించడం దారుణమన్నారు.ఉపాధి హామీ పథకాన్ని కాంట్రాక్టర్లకు మార్చే కుట్ర జరుగుతుందన్నారు. 197 రద్దు చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

# ఐఎల్‌పిఎ 5వ రాష్ట్ర మహాసభ



ప్రజాపక్షం/వరంగల్ లీగల్ : ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఈ నెల 20 న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరుగు ఐ ఎల్ పి ఎ 5వ రాష్ట్ర మహాసభకు న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరై జయప్రద చేయాలని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలస సుధీర్ పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ జిల్లా కోర్టు ముందు ఐఎల్ పిఎ మహాసభ గోడ పత్రికలను విడుదల చేసి ఆయన మాట్లాడారు. 80 ఏండ్ల స్వతంత్ర భారతం అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడుతుందని, ఆ అభివృధి కొద్దిమందికే పరిమితమై మెజార్టీ ప్రజలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండి ప్రజల మధ్య మరింత అసమానతలు పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి తెలిసిన న్యాయవాదులు సమసమాజ స్థాపనలో ముందుండాలని అన్నారు. న్యాయవాదుల రక్షణ, అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేసే ఐఎల్‌పిఎ న్యాయవాదులు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐఎల్పిఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయిని నరేందర్ మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ చూపిన ఉద్యమ బాటలో న్యాయవాదుల వృత్తిపరమైన అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూనే సామాజిక అసమానతలు తొలిగించే పోరాటంలో, సమాజ పరివర్తన కోసం ఐఎల్పిఏ చేస్తున్న పోరాటంలో న్యాయవాదులు కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత విద్యావంతులు, సమాజంలో ఎదిగిన వారు ఎదగని సమాజాన్ని నిర్లక్ష్యం చేయడం వల్లనే సమానత్వం రావడం లేదని, అంబేద్కర్ చూపిన పే బ్యాక్ టు సొసైటీ మార్గంలో న్యాయవాదులు పయనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20 న కొత్తగూడెంలో జరుగు రాష్ట్ర సదస్సులో రాజ్యాంగ విలువలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ప్రజల హక్కులు, ఇ డబ్ల్యు ఎస్ కు లేని నిబంధన ఓబీసీ లకు ఎందుకు, మహిళా కోటాలో బహుజన కోటా, న్యాయవాద రక్షణ చట్టం అనే నాలుగు అంశాలపై జరుగు సదస్సుకు ముఖ్య అతిథులుగా మాజీ హై కోర్టు జడ్జి, మాజీ జాతీయ ఓబీసీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, విశిష్ట అతిథులుగా కొత్తగూడెం జిల్లా జడ్జి పాటిల్ వసంత్, సామాజిక ఉద్యమకారులు సుభాష్ చంద్ర బోస్, డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు హాజరవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐఎల్‌పిఎ రాష్ట్ర నాయకులు తీగల జీవన్ గౌడ్, చిల్లా రాజేంద్రప్రసాద్, వరంగల్ జిల్లా కన్వీనర్ విలాసాగరం సురేందర్ గౌడ్, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రమాకాంత్, న్యాయవాదులు అంబరీషరావు, పూస రవీందర్, రమేష్, కొంగర పూర్ణచందర్, జన్ను ప్రభాకర్, దేవులపల్లి శ్రీకాంత్, ముత్యాలరావు, ఆనంద్, సాంబశివరాజు, జి ఆర్ శ్రీనివాస్, సుందర్ రామ్, సాయి పవన్, నీలిమ, అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల బాధ్యతాయుత ప్రవర్తన ప్రశంసనీయం



ప్రజాపక్షం/మహాదేవపూర్: ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా ప్రజలు చూపిన బాధ్యతాయుత ప్రవర్తన ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.బుధవారం నిర్వహించిన రెండో సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా కాటారం,మహాదేవపూర్; మల్హార్, మహా ముత్తారం మండలాలలోని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డితోకలిసి పరిశీలించారు. ఈ సంద్బంగా ఆయన మాట్లాడుతూ మూడోదశ పోలింగ్ విజయవంతంగా పూర్తైందని తెలిపారు. మూడో దశలో భాగంగా కాటారం, మహాదేవపూర్, మహా ముత్తారం, మల్హార్ మండలాలలో పోలింగ్ ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు దశల వారిగా పోలింగ్ వాతం పెరిగిందని అన్నారు. మూడో దశలో మొత్తం సగటున 84.02 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.ఆటారంలో 82.28 శాతం,మహాదేవపూర్‌లో 84.38 శాతం, మహాముత్తారంలో 86.42 శాతం, మల్హార్‌లో 83.80 శాతం పోలింగ్‌నమోదైనట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, పోలీస్ యంత్రాంగానికి, పాత్రికేయులకు అలాగే శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మూడో దశ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా సాగడం లోప్రజల సహకారం వల్లనే సాధ్యమైదని అన్నారు.

# విధులలో సిబ్బంది అలసత్వం వహించరాదు

ప్రజాపక్షం/జఫర్‌గడ్: విద్యుత్ సిబ్బంది విధులలో సిబ్బంది అలసత్వం వహించకూడదని ఘనపూర్ ఆపరేషన్ ఏడీఈ పాల్వాయి రణధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం 33/11 కేవీ ఓబులాపూర్ విద్యుత్ ఉప కేంద్రంలో పర్యవేక్షించిన రణధీర్‌రెడ్డి మాట్లాడుతూ సబ్‌స్టేషన్ ఆవరణలో విధులు నిర్వహించే సిబ్బంది అలసత్వం వహించకూడదని, 24 గంటలు సరఫరాలోని హెచ్చు, తగ్గులను గమనిస్తూ ప్రతి గంటకు రీడింగ్ నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇప్పగూడెం (లైన్ ఇన్స్‌పెక్టర్) కాలురామ్, తీగారం అసిస్టెంట్ లైన్‌మెన్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్ పార్టీ జెండాను మోస్తూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. బుధవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఓ సిటీ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు అధికారులతో అప్పటికప్పుడే ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా కొండా మురళి మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్న ఎలాంటి పైరవీలు చేయకుండా ఆఫీస్‌కు వచ్చి తనను నిర్భయంగా సంప్రదించవచ్చని ప్రజలకు స్పష్టం చేశారు. ప్రభుత్వాలు మారినా ఎన్ని కష్ట నష్టాలు ఎదురైనా కాంగ్రెస్‌ని నమ్ముకొని భుజాన పార్టీ జెండా మోస్తూ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్యకర్తలకు సరైన గుర్తింపు వచ్చేలా వారికి కావల్సిన పదవులను దక్కేలా చేస్తామన్నారు. అందరం కలిసి మెలిసి ఉండాలని ఐక్యమత్యం చాటాలన్నారు. కార్యకర్తలకు, నాయకులకు పార్టీ పరంగా గౌరవ మర్యాదలు దక్కే విధంగా తాను పాటుపడతానన్నారు. కొండా దంపతులు వరంగల్ ప్రజలకు ఎల్లపుడు అండగా ఉంటారని ఎలాంటి ఆపద సమయాల్లోనైనా కొండా దంపతుల ఇంటి తలుపులు తెరిచే ఉంటాయన్నారు.

# అమెరికా మారథాన్ పోటీలో ప్రతిభ కనపరిచిన బుర్ర లాస్య గౌడ్




ప్రజాపక్షం/భూపాలపల్లి: అమెరికాలోని మారథాన్ పోటీలో భూపాలపల్లికి చెందిన బుర్ర లాస్య గౌడ్ ప్రతిభ కనబరిచి పతకం సాధించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రానికి చెందిన బుర్ర రమేష్, సునిత దంపతుల కూతురు లాస్య అమెరికాలో విద్యనభ్యసిస్తుంది. కాగా అమెరికాలోని అలభామా స్టేట్స్ హన్స్ విల్ సిటీలో రాకెట్ సిటి మారథాన్ 21 కిలో మీటర్ల విభాగంలో పాల్గొన్న లాస్య గౌడ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెడల్ సాధించింది. అమెరికాలో పాల్గొన్న ఏకైక తెలంగాణ అమ్మాయిగా లాస్య కీర్తి గడించింది. ప్రతిభ కనబర్చిన లాస్యను అలభామా యూనివర్సిటీ అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. గతంలో కూడా లాస్య 21 సంవత్సరాలకే ఐసీసీ క్రికెట్ కోచ్ లెవెల్ వన్ సర్టిఫికెట్ అందుకుంది. లాస్య గౌడ్ అమెరికాలోని మీనాసోటా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడంతో పాటు తెలంగాణ అండర్ 19 క్రికెటర్ పోటిలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆయనతో పాటు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, జివిఆర్ ట్రస్ట్ చైర్మన్ గండ్ర గౌతమ్ రెడ్డి, సింగరేణి స్పోర్ట్స్ సూపర్ వైజర్ పర్స శ్రీనివాస్, అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చినరాజయ్య, పుతల సమ్మయ్య క్రికెట్ కోచ్ శ్రీనివాస్‌లు బుర్ర లాస్య గౌడ్‌ను అభినందించారు.

# అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసుకోవద్దు

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : అపరిచిత వ్యక్తులు, సామాజిక మాధ్యమాల్లో గాని తమ వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసుకోవద్దని సైబర్ సెక్యూరిటీ ఎస్పీ తెలియజేశారు. ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ కార్యక్రమంలో భాగంగా సైబర్ సెక్యూరిటీవి వరంగల్ కమిషన్ విభాగం ఆధ్వర్యంలో బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ సైబర్ సెక్యూరిటీవింగ్ డైరెక్టర్ శిఖా గోయెల్ ఆధ్వర్యంలో ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ కార్యక్రమం ద్వారా తెలంగాణ వ్యాప్తంగా సైబర్ నేరాలపై ప్రజలతోపాటు విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతోందని. ఈ డిజిటల్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరిగా ఉండాలని తెలుపుతూ, డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్ లు, పెట్టుబడి మోసాలు, మ్యాట్రిమోనీ,ట్రేడింగ్ యాప్స్ ద్వారా సైబర్ నేరగాళ్ళు వివిధంగా మోసాలకు పాల్పడటం జరుగుతుంది. అలాగే ఇలాంటి సైబర్ మోసగాళ్ళ భారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ఎస్పీ వివరించడంతో పాటు, ఒక వేళ ఎవరైనా సైబర్ నేరగాళ్ళ చేతుల్లో మోసపోతే తక్షణమే 1930 నంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అదేవిధంగా http://www.cybercrime.gov.in వెబ్ సైట్ చేయవచ్చని. సైబర్ నేరాగాళ్ళ చేతుల్లో మోసపోయిన అనంతరం చర్యలు తీసుకోవడం కాకుండా వారి మోసపోకుండా ముందుగానే మీరు అప్రమత్తంగా వుంటే ఇలాంటి సైబర్ నేరాలకు చెక్ పెట్టగలమని ఎస్పీ తెలియచేసారు. అనంతరం సైబర్ నేరాల పట్ల ఏవిధంగా అప్రమత్తం వుండాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమం సైబర్ సెక్యూరిటీ వింగ్ వరంగల్ విభాగం డీ. ఎస్పీ గిరికుమార్, ఇన్స్ స్పెక్టర్లు యాసిన్,అశోక్ కుమార్,కళాశాల ప్రిన్స్ పాల్ ప్రకాష్, ఎస్. బలు చరణ్ కుమార్, శివ కుమార్, ఎస్.బి.ఐ ప్రాంతీయ మేనేజర్ అబ్దుల్ రహీమ్ షేక్, తో పాటు కళాశాల హెచ్.ఓ. డి లు ఇతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్‌గా గుమ్మడి సోమయ్య




ప్రజాపక్షం/మంగపేట: మండలంలో కమలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్యను రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ డైరెక్టర్ గా నియమిస్తు ప్రభుత్వం గత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్తగా పని చేసిన ఆయన 2001లో మంగపేట మండలం జడ్పీటీసీగా గెలుపొందారు. 2006 వారు పదవీ కాలం పూర్తవ్వగా 2006 నుండి 2011 వరకు మండలంలోని మేజర్ గ్రామ పంచాయితీ పారిశ్రామిక ప్రాంతం అయిన కమలాపురం సర్పంచ్ గా భాద్యతలు నిర్వహించారు పార్టీకి నమ్మిన బంటుగా ఉంటు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి పార్టీ ఒడి దుడుకుల్లో సైతం మండలంలో పార్టీని ముందుకు నడిపిన వ్యక్తిగా పార్టీ రాష్ట్ర పెద్దలలో మంచి పేరును సంపాదించారు. ప్రస్తుత రాష్ట్ర పంచాయితీ రాజ్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలుగుదేశం పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన దగ్గరనుండి మంత్రి సీతక్క వెను వెంటనే ఉంటు తన భాద్యతలను నిర్వహించారు. ఆయన పని తనాన్ని గుర్తించిన ప్రభుత్వ పెద్దలు ఆయనను రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ డైరెక్టర్ గా నియమిస్తు మంగళవారం రాత్రి తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఉత్తర్వులను జారీ చేశారు. తనకు భాద్యతాయుతమైన పదవిని అప్పగించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయితీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి శాయ శక్తులా న్యాయం చేస్తానని పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

**పంచాయితీరాజ్ డైరెక్టర్ కు అభినందనల వెల్లువ**

రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ డైరెక్టర్ గా ఎంపిక అయిన గుమ్మడి సోమయ్యకు స్థానిక నాయకులు శాలువాలు పుష్ప గుచ్చాలను అందించి అభినందించారు. ఈ సందర్బంగా పలువురు మాట్లాడుతు కష్టానికి తగిన ఫలితం లభించిందని పార్టీని నమ్ముకున్న ఎవ్వరిని కాంగ్రెస్ పార్టీ నిరాశ పరచదని అన్నారు. అనంతరం స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కర్రి నాగేంద్ర బాబు,కాంగ్రెస్ పార్టి బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ కమలాపురం గ్రామ అధ్యక్షుడు బేవర సత్య నారాయణ మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చిట్యాల పురుషోత్తం, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరాం రామ్మోహన్, గూడూరు రంజిత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌గా గెలిచిన ఒక్కరోజుతోనే మొదలైన అభివృద్ధి పనులు



ప్రజాపక్షం/తొర్రూరు : మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఆదివారం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన ముద్దం సునీతా వీరారెడ్డిలు గ్రామంలో అభివృద్ధి పనులు మొదలు పెట్టారు. బుధవారం గ్రామంలోని ఒకటవ వార్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో విషయం తెలుసుకొని వెంటనే శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాన్ని జేసీబీ సహాయంతో తొలగించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు, కాలనీ వాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కు బిక్కుమని ఉండేవాళ్ళమని తెలిపారు. సునీతా వీరారెడ్డి సర్పంచ్‌గా గెలిచిన ఒక్కరోజులోనే ఇలాంటి అభివృద్ధి పనులు చేపట్టి మాకు ధైర్యాన్ని ఇచ్చారని తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్ సునీతా వీరారెడ్డిలు మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధిలో ముందుంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. తాము ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# మూడవ విడత ఎన్నికలు ప్రశాంతం



ప్రజాపక్షం/ సంగారెడ్డి : జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో మొత్తం 87.43 శాతంపోలింగ్ నమోదైనట్లు అదికారులు వెల్లడించారు. మూడవ విడతగా కల్హెర్ ,కంగ్టి, మనూర్, నాగల్ గిద్ద, నారాయణ ఖేడ్, నిజాంపేట్, న్యాల్కల్, సిర్గాపూర్, మండలాలలో బుదవారం పోలింగ్ జరిగింది. ఈ ఎనిమిది మండలాల్లో కలిపి మొత్తం 2,25,483 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,97,134 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మొత్తం 87.43 శాతం పోలింగ్ నమోదైంది.

### మండలాల వారీగా పోలింగ్ వివరాలు

కల్హెర్ మండలంలో మొత్తం ఓటర్లు 16,823లు ఓటేసిన వారు 14,814 పోలింగ్ నమోదు శాతం 88.06గా , కంగ్టి మండలంలో మొత్తం ఓటర్లు 34,992 , ఓటేసిన వారు 30,153 ,పోలింగ్ శాతం 86.17 శాతంగా, మనూర్ మండలం మొత్తం ఓటర్లు 25,038 ఓటేసిన వారు 22,372 పోలింగ్ శాతం 89.35గా, నాగల్ గిద్ద మండలం మొత్తం ఓటర్లు 23,924 ఓటేసిన వారు 21,012 ,పోలింగ్ శాతం 87.83 గా నారాయణ్ ఖేడ్ మండలం మొత్తం ఓటర్లు 39,503, ఓటేసిన వారు 34.591 పోలింగ్ శాతం 87.57గా నిజాంపేట్ మండలం మొత్తం ఓటర్లు 16,181 ఓటేసినవారు 14,388 పోలింగ్ శాతం 88.92గా ,న్యాల్కల్ మండలం మొత్తం ఓటర్లు 47,040 ,ఓటేసిన వార్లు 40452 పోలింగ్ శాతం 85.99గా సిర్గాపూర్ మండలం మొత్తం ఓటర్లు 21,982 ఓటేసిన వారు 19,352 ,పోలింగ్ శాతం 88.04 గా నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## ప్రమాదకరంగా మూల మలుపులు: నిత్యం ప్రమాదాలు

### మాడల్ స్కూల్ విద్యార్థులు ఆవేదన



ప్రజాపక్షం/రేగోడ్ : మెదక్ జిల్లా లో రేగోడ్ మండల కేంద్రంలో రేగోడ్ నుండి తాసిల్దార్ కార్యాలయానికి వెళ్ళడానికి భయం భయం జోగిపేట్ వెళ్లే రోడ్డులకు 52మూలమలుపులు ఉండడం వల్లన రోడ్డులకు ఇరు వైపుల పిచ్చిమొక్కలు ఉండడం వల్లన ప్రమాదాలు తరుచు జరుగుతున్నాయి అధికారులు మాత్రం సూచిక బోర్డు ఏర్పాటు చేయడం లేదని వాహనదారులు మాడల్ స్కూల్ విద్యార్థులు ఆవేదన వ్యక్తిత్వం చేస్తున్నారు ఈ పుటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు ఇరు వైపుల పిచ్చిమొక్కలు తొలగించి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని కొరుతున్నారు.

## తుర్కపల్లిలో యాస్మీన్ ఓటు గల్లంతు



ప్రజాపక్షం/ సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి గ్రామంలో ఓటు చోరీ ఘటన కలకలం రేపింది. ఓటు వేయడానికి వచ్చిన ఓ మహిళకు ఇప్పటికే తన ఓటు నమోదు అయిందని అదికారులు చెప్పడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఉంటున్న యాస్మీన్ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తుర్కపల్లి గ్రామంలోని పోలింగ్ బూత్‌కు వచ్చారు. అయితే ఆమె పోలింగ్ బూత్ వెళ్లగానే మీ ఓటు ఇప్పటికే నమోదు అయిందని ఎన్నికల అధికారులు తెలియజేశారు. దీనితో షాక్‌కు గురైన యాస్మీన్ తన ఓటు ఎవరు వేశారని ప్రశ్నిస్తూ పోలింగ్ బూత్ లోనే ఆందోళనకు దిగారు. గ్రామంలో తన ఓటు చోర జరిగిందంటూ యాస్మీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు వేయకుండా బయటకు వచ్చిన ఆమె పోలింగ్ బూత్ ముందు నిరసన చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో తుర్కపల్లి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ప్రశాంతంగా ముగిసిన తుది విడత ఎన్నికల పోలింగ్ పర్వం

### జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్

ప్రజాపక్షం/ సంగారెడ్డి : మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, పోలింగ్ శాతం 87.43 నమోదు అయినట్లు జిల్లా ఎస్పీ వివరించారు. ఆయా గ్రామాలలో కౌటింగ్ ప్రక్రియా సరళంగా కొనసాగుతుందని కౌంటింగ్ ప్రక్రియ పూర్తియ్యే వరకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయోత్సవ ర్యాలీలకు డీజేలకు అనుమతి లేదని ఎవరైనా ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## చెతకు పరిష్కారం బయో మైనింగ్



ప్రజాపక్షం/ సంగారెడ్డి : ఫసల్వాది లో పోగు పడిన చెత్త ని ప్రాసెస్ ప్రక్రియ (బయో మైనింగ్ ) ప్రారంభమైంది. సంగారెడ్డి పురపాలక సంఘము పరిధిలో ప్రతి రోజు సేకరించిన చెత్త పసల్వాది డంప్ యార్డు కి తరలించే వారు అయితే చాలా రోజుల నుండి చెత్త పోతవ్వడం వల్ల అనేక సమస్యలు వచ్చేవి. అన్నింటికి పరిష్కారం చూపుతూ అధికారులు బయో మైనింగ్ ప్రక్రియ రెండు రోజుల క్రితం ప్రారంభించారు. దాదాపు 2 నెలలు పాటు కొనసాగిన బయో మైనింగ్ యంత్రాల బిగింపు పూర్తి అవడంతో పనులను మున్సిపల్ కమీషనర్ ఎం శ్రీనివాస్ రెడ్డి, ప్రారంభించారు. రోజుకు 16 గంటల చొప్పున ప్రతి రోజు 300 మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేస్తున్నారు. ప్రాసెసింగ్ ప్రక్రియ లో వచ్చే బయో సాయిల్ ఎరువుగా ఇనర్ట్ ని గుంతలు పుడ్చాడానికి ఆర్‌డిఎఫ్, ని సిమెంట్ పరిశ్రమకి తరలిస్తారు. డి ఈఈ రఘు పర్యవేక్షణ లో బయో మైనింగ్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగించుటకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుదవారం రోజు అధకారులు అక్కడ జరుగుతున్న బయో మైనింగ్‌ప్రక్రియను పరిశీలించారు. మున్సిపల్ కమీషనర్, శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, వీరేశం , శానిటేషన్, సూపర్ వైజర్, అంబోజి ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌లకు ఘన సన్మానం

### సేవతోనే ప్రజల హృదయాలు గెలవాలి



ప్రజాపక్షం/ పటాన్‌చెరు : పటాన్‌చెరు నియోజకవర్గంలోని పటాన్‌చెరు మండలంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడత లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచులుగా ఘన విజయం సాదించారు. ఈ సందర్భంగా క్యాసారం, నదిగామ, గ్రామాలలో విజయం సాధించిన సర్పంచులతో పాటు వార్డు సభ్యులను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కాట శ్రీనివాస్‌గౌడ్ ,సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుదా శ్రీనివాస్ గౌడ్‌లు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పాలనలో బాధ్యత అత్యంత కీలకమని ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారునికి చేరవేయడంలో సర్పంచులు పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్, సర్పంచులు విజయం వెనుక పార్టీ నాయకులు , కార్యకర్తల సమిష్టి కృషి ఉందని కొనియాడుతూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా బాధ్యతయుతంగా పనిచేయాలని సూచించారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సహకరించిన వారికి ధన్యవాదాలు

### జిల్లా ఎన్నికల అదికారి కలెక్టర్ పి.ప్రావీణ్య

ప్రజాపక్షం/ సంగారెడ్డి : జిల్లాలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా పూర్తి కావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి జిల్లా ఎన్నికల అదికారి కలెక్టర్ పి. ప్రావీణ్య హృదయపూర్వక దన్యవాదాలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో బాగంగా అంకిత బావంతో పనిచేసిన రిటర్నింగ్ అదికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పోలింగ్ అదికారులు ఇతర ఎన్నికల సిబ్బంది పోలీస్‌శాఖ ,రవాణాశాఖ, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర సంబందిత శాఖల అధికారులు సహకారం అభినందనీయమని తెలిపారు. అలాగే ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సహకరించిన అభ్యర్థులు ,మీడియా ప్రతినిదులకు శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పండుగగా నిలిచిన గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయడంలో అందరి సహకారం కీలకమైందని కలెక్టర్ పేర్కొన్నారు.

## మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన జగిర్యాల సర్పంచ్



ప్రజాపక్షం/రేగోడ్ : దక్ జిల్లా లో రేగోడ్ మండ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జగిర్యాల సర్పంచ్‌గా ఎంపికైన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ను సోమవారం సర్పంచ్ ర్యాకల వీరమ్మ వార్డు సభ్యులు లో సంగారెడ్డిలో కలిశారు ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకల వీరమ్మ మాట్లాడుతూ జగిర్యాల గ్రామ పంచాయతీ అన్ని విధాలగా అభివృద్ధి చేస్తామని మంత్రి సహకారంతో ఆదర్శ గ్రామంగా జగిర్యాలను అభివృద్ధి చేస్తామని అన్నారు.

## పేద విద్యార్థులకు యూనిఫామ్ కోసం ఆర్థిక సాయం



ప్రజాపక్షం/అల్లాదుర్గం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు ప్రిన్సిపాల్ సత్తయ్య యూనిఫామ్ కొరకు విద్యార్థికి చెక్కు అందజేశారు. అల్లాదుర్గం ప్రభుత్వ కళాశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థుల కోసం బుధవారం వారి ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు , విద్యార్థులకు చదువులతో ఎన్ని లాభాలు ఉంటాయో వారు వివరించారు. విధిగా విద్యార్థులు కళాశాలకు రావాలని సూచించారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేక, కూలి పనులకు వెళ్తున్న విద్యార్థికి ప్రిన్సిపల్ తన సొంత ఖర్చులతో వారికి సహాయం అందించారు. విద్యార్థులు కళాశాలకు రోజు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహారెడ్డి, శ్యామ్ రావు, రవీందర్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

# అక్కన్నపేటలో కాంగ్రెస్‌దే హవా..

ప్రజాపక్షం/అక్కన్నపేట : మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సిద్దిపేట జిల్లా అక్కన్న పేటలో బుధవారం ప్రశాంతంగా ముగిసింది.మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కౌంటింగ్ నిర్వహించిన పోలింగ్ అధికారులు విజేతల వివరాలు ప్రకటించారు.ఈ గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మద్దతుదారులు తమ హవాను కొనసాగించారు.ఈ విడతలో మండలంలో 33,431 మొత్తం ఓటర్లుండగా 29,441 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.అక్కన్నపేట మండల వ్యాప్తంగా గెలుపొందిన వివరాలు ఇలా ఉన్నాయి.అక్కన్నపేట సర్పంచ్‌గా జన్నారపు సంపత్(స్వతంత్ర),కేశనాయక్‌తండా లావుద్యా సులోచన (బీఆర్ఎస్),గొల్లకుంట కాశబోయిన రాజవ్వ(కాంగ్రెస్),పంతులుతండా లావుద్యా రాజు(కాంగ్రెస్),అంతకపేట కొయ్యడ సృజన్ (సీపీఐ),రేగొండ గంగరవేన వనేష్(బీఆర్ఎస్),కపూర్‌నాయక్‌తండా మాలోతు మణి(బీఆర్ఎస్),మసిరెడ్డి తండా ముడావత్ మణెమ్మ (బీఆర్ఎస్),మల్‌చెర్వు తండా గుగులోతు మహేందర్ (బీఆర్ఎస్),జనగాం బొడ్డు ఈశ్వర్ (బీఆర్ఎస్),కేశ్వాపూర్ బోనగిరి మమత (బీఆర్ఎస్),మంచినీళ్ళబండ నరెడ్ల కుమార్ (బీఆర్ఎస్),మోత్కులపల్లి ఏల్పుగొండ కొంరవ్వ(బీఆర్ఎస్) ,మైసమ్మవాగుతండా భూక్య క్రిష్ణ (బీఆర్ఎస్),కన్నారం జన్ని రవి (కాంగ్రెస్) ,రామవరం బొమ్మ శ్రీశైలం (కాంగ్రెస్),హతీరాం అంబానాయక్ తండా భానోతు ప్రమీల (కాంగ్రెస్),సేవాలాల్ మహరాజ్ తండా జర్పుల సునిత (కాంగ్రెస్),చౌటకుంట తండా గుగులోతు జాన్‌కుమార్ (కాంగ్రెస్),నందారం సుగుర్తి శ్రీలత (కాంగ్రెస్),పోతారం(జే ) వాసాల తిరుపతి (కాంగ్రెస్),ధర్మారం కూస శ్రీనివాస్‌రెడ్డి (కాంగ్రెస్),బొడిగపల్లి పిట్టల వినోద్ (కాంగ్రెస్),చౌటపల్లి పత్తిపాక లావణ్య (కాంగ్రెస్),పెద్దతండా గుగులోతు తిరుపతి (కాంగ్రెస్),చాపతండా గుగులోతు రాజేందర్ (కాంగ్రెస్),గుబ్బడి మేడవేని సంతోషా (కాంగ్రెస్),కట్కూర్ కొడముంజ బాలరాజు (బీఆర్ఎస్),గండిపల్లి బందారం శ్రీనివాస్ (కాంగ్రెస్),గోవర్ధనగిరి పెండెల రమ (బీఆర్ఎస్),మల్లంపల్లి మ్యాక ఇస్త్రేరా (కాంగ్రెస్),గౌరవెల్లి పాంద్రాల దాము (కాంగ్రెస్) విజేతలుగా నిలిచారు.

**ఆరు గ్రామాలు ఏకగ్రీవం:** మండలంలో మొత్తం 38 గ్రామాలుండగా అందులో 125 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలవగా.604 మంది వార్డు సభ్యులుగా బరిలో నిలిచారు.ఇందులో ఆరు గ్రామాలు ఏకగ్రీవం అయ్యాయి. దుబ్బతండా గుగులోతు శీల ,దాసుతండాలో పూనీ,కెప్టెన్ స్వరూప,శ్రీరాంతండాలో భానోతు వెంకటేష్,కుందనవానిపల్లిలో వెంకవ్వ,గొల్లపల్లిలో గుడాల లావణ్య ఏకగ్రీవమయ్యారు.

# ధూళ్మిట్టను మరింత అభివృద్ధి చేస్తా

సర్పంచ్ గునుకుల లీల జగన్‌మోహన్ రెడ్డి



ప్రజాపక్షం/మద్దూరు/ధూళ్మిట్ట : ధూళ్మిట్ట మండల కేంద్రంతో పాటుగా జాలపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు గునుకుల లీల జగన్‌మోహన్ రెడ్డి 813ఓట్లుతో, జాలపల్లిలో చెట్కూరి కమలాకర్ యాదవ్ 252 ఓట్లు తో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఓడించి విజయం సాధించారు. తమకు ఓటువేసి ఆదరించిన గ్రామ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు నూతనంగా ఎన్నికైన ధూళ్మిట్ట గ్రామ సర్పంచ్ గునుకుల లీల జగన్‌మోహన్ రెడ్డి, జాలపల్లి సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ధూళ్మిట్ట, జాలపల్లి గ్రామాలని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. అధికారంలోని ప్రభుత్వం సహకారంతో అర్హుల అందరికి సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. ప్రజలకు కష్టసుఖాల్లో పాలుపంకుంటామని హామీనిచ్చారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిక

ప్రారంభమైన వలసలు

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: మండల పరిధిలోని తిగుల్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నుండి అధికార కాంగ్రెస్ పార్టీలో భారీ సంఖ్యలో చేరారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా పోటీ చేసిన కొడిగుడ్ల మహేష్‌తో పాటు పలువురు బిఆర్ఎస్ క్రియాశీల కార్యకర్తలు గజ్వేల్ మాజీ ఎంఎల్ఎ నర్సారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఎఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి,మాజీ ఎంపిటిసి బట్టు మంజుల మహేందర్‌రెడ్డి, తిగుల్ మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రావు, నాయకులు రాజు, జంగిని ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు

మూడవ విడతలో మూడు..

వంతుల గెలుచుకున్నది కాంగ్రెస్

ప్రజాపక్షం / హుస్నాబాద్ : బుధవారం హుస్నాబాద్ మండలంలోని జరిగిన మూడవ విడత ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 7 గంటల నుండి 1 గంటవరకు ప్రశాంత వాతవరణంలో జరిగింది . మండలంలోని మొత్తం 87.63 పోలింగ్ శాతంతో ప్రశాంతంగా పోలైంది. మూడవ విడత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూడు వంతులు గెలిచి తన సత్తాచాటుకుంది . మండలంలోని 17 గ్రామ పంచాయితీలకు గాను 3 గ్రామ పంచాయితీలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగ 14 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ 17 స్థానాల్లో 11 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుని బిఆర్ ఎస్ పార్టీ కి చెందిన అభ్యర్థికి కాంగ్రెస్ మద్దతు ప్రకటించి ఏకగ్రీంగా చేసి కాంగ్రెస్ పార్టీలో కలుపుకుంది దానితో 12 పంచాయితీలు కాంగ్రెస్ ఖాతో కలుపుకుని కలుపుకుంది . మరో 4 స్థానాల్లో బిఆర్ ఎస్ పార్టీ తన ఉనికిని చాటుకుంది . మరో స్థానం నుండి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందాడు. ఈ సందర్భంగా గెలుపొందిన సర్పంచులకు, ఉప సర్పంచులకు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు తన క్యాంపు కార్యాలయంలో శాలువతో ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో గెలుపొందిన ప్రతి సర్పంచు గ్రామ అభివృద్ధికి కృషిచేయాలని కోరుతూ మీకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేయాలని నూతన సర్పంచులను కోరారు.

## ఎస్.జి.ఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ప్రజాపక్షం/కరీంనగర్:పారమిత ఉన్నత పాఠ శాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.చాణక్యన్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక అయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. డిసెంబర్ 15న కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎస్.జి.ఎఫ్ అండర్ 14 బాలుర బాక్సింగ్ చాంపియన్షిప్ పోటీలలో పారమిత ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఎం.చాణక్యన్ 32 34 కిలోల విభాగంలో బంగారు పథకం సాధించి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనాడు. రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో హన్మకొండ పట్టణంలోని జె.ఎన్ స్టేడియంలోని బాక్సింగ్ హాల్ లో డిసెంబర్ 18 నుండి 25 వరకు తేదీలో నిర్వ హించనున్న 69వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా॥ ఇనుగంటి ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు. ఎం.ప్రసాద్, హనుమంతరావు. ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్ సమన్వయకర్త శ్రీనాథ్ లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థిని, బాక్సింగ్ కోచ్ ఎ.రామకృష్ణ ను అభినందించారు.

## చలి వణుకుతో ప్రజలు గజ.. గజ..!



ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో చలి పులి పంజా విసురుతోంది.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గత వారం రోజు నుండి 15 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోయిందని చెబుతున్నారు.ఉష్ణోగ్రతలు రోజురోజుకు తగ్గడంతో ప్రజలు ఎటూ వెళ్లలేక ముసుగు కప్పి ఇంట్లోనే ఉండిపోతున్నారు.. ఉదయం 7 గంటలు దాటుతున్నా సూర్యుడు కనిపించని పరిస్థితి. తెల్లవారుజామున మంచు కురుస్తుండటంతో పనుల నిమిత్తం బయటికి వెళ్లే వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గాలిలో తేమ శాతం పెరిగిపోవడం, వాతావరణంలో వచ్చిన మార్పులతో చలి తీవ్రత పెరిగిందని అధికారులు అంటున్నారు. సాధారణంగా జనవరిలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అలాంటిది ఈ ఏడాది డిసెంబర్ లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఉపాధి హామీ పథకం దేశ ప్రజల గుండెల్లో నిలిచిపోయింది

మాజీ మంత్రి తాటి పర్తి జీవన్ రెడ్డి



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో బుధవారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, డిసిసిఅధ్యక్షుడు గాజంగి నందయ్యతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

**మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ** : అవినీతిని నిలువరించేందుకు, పారదర్శకత కోసం సమాచార హక్కు చట్టం ఉందని మాజీ మంత్రి అన్నారు. నిరుపేద వర్గాల ప్రజలు ఆకలితో అలమటించకూడదని ఆహార భద్రత చట్టం, విద్య ప్రాధాన్యతను గుర్తించి విద్యా హక్కు చట్టాన్ని, గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించాలని ఉపాధి హామీ చట్టాన్ని యూపీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సోనియా గాంధీ ఆలోచన, మన్మోహన సింగ్ దార్శనికతతో జాతిపిత మహాత్మ గాంధీ పేరిట జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా నామకరణం చేశారని గ్రామీణ ప్రాంత ప్రజలకు పని కల్పించేందుకు ఉపాధి హామీ చట్టం రూపొందించారు జీవన్ రెడ్డి అన్నారు. రెండు దశాబ్దాల కాలంలో ఉపాధి కల్పించడంతో పాటు, ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతంలో చేపట్టే ప్రతి అభివృద్ధి పని ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టారని జీవన్ రెడ్డి గుర్తు చేశారు. హరిత హారం గుంతలు తీయడం, వైకుంఠ ధామాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, పాఠశాలల్లో టాయిలెట్స్, అంగన్వాడీ భవనల నిర్మాణాలు, గ్రామ పంచాయతీ భవన్ నిర్మాణాలు అన్ని ఉపాధి హామీ పథకం నిధులే ఆధారమని మాజీ మంత్రి అన్నారు. ఉపాధి హామీ పథకం దేశ ప్రజల గుండెల్లో నిలిచి పోయింది. గతంలో 100 రోజులు పని దినాలను ప్రస్తుతం 125 దినాలుగా పెంచటం పై మాజీ మంత్రి జీవన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గతంలో వ్యవసాయ రంగానికి కూడా ఉపాధి హామీ అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశానని వ్యవసాయానికి అనుబంధం చేయడంతో కులీలకు పని లభించడంతో పాటు, రైతులకు మేలు జరుగుతుందని, వ్యవసాయానికి అనుసంధానం చేసి ఉపాధి హామీ పథకానికి మార్పులు చేసి అమలు చేయాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం మార్గదర్శనం చేసిన మహోన్నతుడు మహాత్మ గాంధీ అని, ఉపాధి హామీ పథకానికి మహాత్మ గాంధీ పేరు మార్చాలనే ప్రతిపాదన సరి కాదని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. కేంద్రం గతంలో ఉపాధి హామీ పథకానికి 100 శాతం నిధులు కేటాయించింది. ప్రస్తుతం కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం కేటాయించాలని ప్రతిపాదించడంతో రాష్ట్రాల పై భారం పెరిగి, నిధుల కొరత ఉపాధి హామీ పథకం అమలుకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందని, యూపీఏ ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం, రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు హక్కుగా లభిస్తున్నాయని ప్రజల గుండెల్లో ఉన్న నెహ్రూ పేరు తుడిచివేయాలని మోదీకి నెహ్రూ పై ఈర్ష్య ఉండేది అని ఇప్పుడు మహాత్మ గాంధీ పై పడ్డారు అని మాజీ మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో కోదండ రామాలయం నిర్మాణం చేపట్టాం వికసిత భారత్ రాముడి పాలన అనుసరిస్తుందని భావిస్తే వికసిత భారత్ కు వికసిత శ్రీరామ్ అని పేరు పెట్టండి అని మాజీ మంత్రి అన్నారు. మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం మరింత మెరుగు పర్చేందుకు కృషి చేయండి. పేరు మార్చడంతో ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏమి లేదని మహాత్మ గాంధీపేరు మార్చినా చెరిగేది కాదు ప్రజల గుండెల్లో ఉంటుందని ఉపాధి హామీ పథకానికి మహాత్మ గాంధీ పేరు తొలగించాలని ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనీ జీవన్ రెడ్డి మరోసారి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధురాలికి అండగా నిలిచిన కానిస్టేబుల్

**ప్రజాపక్షం/కోటపల్లి /చెన్నూరు :** నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని కానిస్టేబుల్ ఎత్తుకెళ్లి ఓటు వేయించి మానవత్వం చాటుకున్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలు ఓటు హక్కు వినియోగించుకోవాలనే తపనతో కుటుంబ సభ్యుల సాయంతో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ ఆమె పరిస్థితిని గమనించిన విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ ఆమెను తన చేతులతో ఎత్తుకుని పోలింగ్ కేంద్రం లోపలికి తీసుకెళ్లారు. ఆమె ఓటు వేసేలా పూర్తిస్థాయిలో సహకారం అందించారు. వృద్ధురాలి స్ఫూర్తిని పోలీసు కానిస్టేబుల్ సేవను గ్రామస్తులు అభినందించారు.



## విజయోత్సవ ర్యాలీలు నిషేధం

### మంచిర్యాల డిసిపి భాస్కర్

**ప్రజాపక్షం/జైపూర్ :** ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతకాలం విజయోత్సవ ర్యాలీలు నిషేధమని మంచిర్యాల డిసిపి భాస్కర్ స్పష్టం చేశారు. బుధవారం జైపూర్ భీమారం చెన్నూర్ కోటపల్లి, మందమర్రి మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ మూడవ విడత ఎన్నికలు శాంతియుతంగా సాగేందుకు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ఫలితాల వెల్లడి సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మూడు దశల పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమల్లో ఉంటుందని చెప్పారు. ర్యాలీలు బైక్ శోభాయాత్రలు డిజె కార్యక్రమాలు పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ప్రజలు రాజకీయ నాయకులు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని ఓర్వలేక దుష్ప్రచారం


### ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పై మాజీ మంత్రి కెటిఆర్ మాటలు అవాస్తవం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవం అని ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం ఖానాపూర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసినన ప్రతికా సమావేశంలో వారు మాట్లాడుతూ మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ సమావేశంలో మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కంటే జాన్సన్ నాయక్ నియోజకవర్గంలో ఎక్కువగా అందుబాటులో ఉంటారని, కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు ఎలాంటి వాస్తవాధారం లేదని, ఎమ్మెల్యే ప్రతి రోజు మార్నింగ్ వాక్ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమై ప్రత్యక్షంగా సమస్యలు తెలుసుకుని,వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని,నియోజకవర్గములో అత్యధికంగా సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలిచిందని,క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని పంచాయతీ ఎన్నికల్లో ప్రజాబలం స్పష్టంగా నిరూపితమైందని తెలిపారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కెటిఆర్ ఇటువంటి మతి భ్రమిత వ్యాఖ్యలు చేస్తున్నారని, మండిపడ్డారు. కెటిఆర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, ఎమ్మెల్యేపై ఆధారం లేని మాటలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, ఆత్మ చైర్మన్ తోట సత్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్,తర్లపాడ్ సర్పంచ్ సచిన్, ఉప సర్పంచ్ నర్సయ్య, నాయకులు జంగిలి శంకర్, రాజు నాయక్, గూడాల రాజన్న, శేషాద్రి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ మెడికవర్ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్య శిబిరం

### నరాల వ్యాధులపై నిపుణుల హెచ్చరిక



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాలో మారుతున్న జీవనశైలి కారణంగా నరాల సంబంధిత వ్యాధులు (Vascular Disorders) వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో ఉచిత వాస్కులర్ కన్సల్టేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సర్జన్ డాక్టర్ అజయ్, బి.మోసూరు రోగులకు అందుబాటులో ఉండి వైద్య సలహాలు అందించారు. ప్రస్తుతం నిర్మల్, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో ప్రతి ముగ్గురిలో ఒకరికి చక్కెర వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయని, వీరిలో సుమారు 20 శాతం మంది కాళ్ల నరాల బ్లాకేజీ బారిన పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డయాబెటిక్ ఫుట్ గాయాలను ప్రారంభ దశలో గుర్తించకపోవడం వల్ల చాలామంది కాలు కోల్పోయే పరిస్థితికి చేరుకుంటున్నారని డాక్టర్ హెచ్చరించారు. మహిళల్లో దీర్ఘకాలం నిలబడి పనిచేసే స్వభావం వల్ల వేరికోస్ వెయిన్స్‌మానని గాయాలు,కాళ్లు రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు.ఆధునిక చికిత్సా విధానాల ద్వారా కాలు కోల్పోయే ప్రమాదాన్ని తగ్గించడమే లక్ష్యంగా మెడికవర్ హాస్పిటల్స్ అ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది.

# మినరల్ ఫండ్ కోసం సర్పంచ్‌లు పోరాడాలి

### తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు మడావి వెంకటేశ్వర్



**ప్రజాపక్షం/కాసిపేట :** కాసిపేట మండల అభివృద్ధి కోసం నూతనంగా ఎన్నికైన సర్పంచులంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా నిలిచి మినరల్ ఫండ్ కోసం పోరాడాలని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు మడావి వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపొందిన నూతన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇకపై రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. కాసిపేట మండలానికి చెందిన నిధులు ఇక్కడ వినియోగించకుండా పక్క ప్రాంతాలకు తరలించడమే మండల అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. దేవాపూర్ సిమెంట్ కంపెనీ నుంచి వచ్చే కోట్ల రూపాయల మినరల్ ఫండ్ కాసిపేటకు దక్కకుండా ఇతర ప్రాంతాలకు మళ్లించడం అన్యాయమన్నారు. సర్పంచులు అందరూ కలిసి మినరల్ ఫండ్‌ను కాసిపేట మండలంలోనే వినియోగించేలా పోరాటం చేయాలని సూచించారు.

మంచిర్యాల నుంచి గోదావరి నీటిని కాసిపేట మండలానికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి నీటిని హైదరాబాద్‌కు తరలిస్తున్నప్పటికీ సమీపంలో ఉన్న కాసిపేటకు తాగు సాగు నీరు అందించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ పాల్గొన్నారు.

# నూతన సర్పంచ్‌లకు బోస్లే నారాయణరావు పటేల్ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుంటాల మండలం లోని లింబ కె,గొల్లమాడ గ్రామ నూతన సర్పంచ్ లను ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణరావు పటిల్ వారికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చంద్రే,నూతన సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.





## సామాజిక సేవకుడు షేక్ ముజాహిద్‌కు ఉత్తమ సేవా పురస్కారం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ ముస్లిం ఏక్తా అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంఘం సేవకుడు శేఖ్ ముజాహిద్ కు నిర్మల్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ పురస్కారం ఇచ్చి ఘనంగా సన్మానించారు.బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవం వేడుకలలో ఆయన సేవలను గుర్తించి సీనియర్ సివిల్ జడ్జి రాధిక జిల్లా ఖజానా అధికారి సరోజన,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్ చేతుల మీదుగా మెమొంటో శాలువాతో సన్మానించారు.తెలంగాణ ఏక్తా సోషల్ వెల్ఫేర్ సొసైటీ సేవలను గుర్తించి అన్ని రంగాలలో సేవలు అందిస్తున్నట్లు ఎం.సీ లింగన్న కృతజ్ఞతలు తెలిపారు.మీ సొసైటీకి ఎప్పుడు అండగా ఉంటానని తెలిపారు.ఇందులో పెన్షన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న,సీనియర్ పాత్రికేయులు ఎంఎ వసిం షకీల్,మహమ్మద్ ఉస్మాన్,పత్తి శివప్రసాద్ సోషల్ మీడియా ఇన్చార్జ్ ఫాజిల్ హాష్మి తదితరులు ఉన్నారు.



## ఉపసర్పంచ్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి గ్రామ ఉప సర్పంచ్‌గా చైతన్య లక్ష్మ ణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ చైతన్య లక్ష్మ ణ్ ను బుధవారం ఆయన 200809 బ్యాచ్ ఎస్ఎస్సీ మిత్రులు అభినందించి,పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపసర్పంచ్‌కు మిఠాయిలు తినిపించారు. ఉప సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మిత్రులు,గ్రామస్థులు ఉన్నారు.

### విజేతలు భీమ్‌గల్ మండలం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** పిప్రి అరిగెల జనార్ధన్, కాంగ్రెస్
మెండోరా కుంట లక్ష్మీ , కాంగ్రెస్
బడాభీమ్‌గల్ విష్ణువర్ధిణి, బిఆర్ఎస్
జాగిర్యాల్ గడలా ప్రసాద్, బిఆర్ఎస్
బాబానగర్ శ్రీరాం అరవింద్, కాంగ్రెస్
కొత్తతండా బాదావత్ లలిత, బీఆర్ఎస్
కుప్కల్ సంపంగి నర్సింగ్, బిజెపి
బాచన్‌పల్లి వన్నెల బాలమణి, కాంగ్రెస్
ఎంజి తండా దేగావత్ అమీనా, గణేష్, బీజేపీ
బాబాపూర్ సమీర్ కాంగ్రెస్
లింగాపూర్ గట్టు ఈశ్వర్ సరస్వతి బీఆర్ఎస్
బెజ్జోరా కార్తీక్ బీఆర్ఎస్
భీంనగర్(దేవక్కపేట్) మాలవత్ పూజ స్వతంత్ర
సికింద్రాపూర్ గంగాధర్‌గౌడ్, బిఆర్ఎస్
పెద్దమ్మ తండా భుక్యా రమేష్, కాంగ్రెస్
దేవన్‌పల్లి లకావత్ శేఖర్, టిఆర్ఎస్
రూప్లతండా సర్ధార్ కాంగ్రెస్
తాళ్లపల్లి భుక్యా రాజారెడ్డి, కాంగ్రెస్
ముచ్కూర్ కొడిగెల శ్రీనివాస్, బిజెపి
చేంగల్ దుమాల మమత రాజు, కాంగ్రెస్
పల్లికొండ పిండి మనుష అశోక్, కాంగ్రెస్
పురాణీపేట్ బుర్ర దేవేందర్‌గౌడ్, స్వతంత్ర
గోన్‌గొప్పుల సేపూర్ చరణ్‌గౌడ్, కాంగ్రెస్